క్లుప్తంగా

నూతన గేట్ వాల్వ్ బిగింపు



సాక్షి ఎఫెక్ట్..

సిరికొండ: మండలంలోని గడ్కోల్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో నెలకొన్న నీటి కష్టాలను అధికారులు తొలగించారు. నీటి కష్టాలపై 'సాక్షి' దినపత్రికలో ఈ నెల 24న 'గడ్కోల్‌లో నీటి తిప్పలు' అనే కథనం ప్రచురితమైంది. కథనానికి స్పందించిన గ్రామ పంచాయతీ కార్యదర్శి మఖ్దుం చెడిపోయిన గేట్ వాల్వ్ స్థానంలో నూతన గేట్ వాల్వ్‌ను ఏర్పాటు చేయించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



మోపాల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలని సవిత్ర చిట్‌ఫండ్ మేనేజింగ్ డైరెక్టర్ సుదర్శన్ అన్నారు. మోపాల్ మండలంలోని సిర్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో తెలంగాణ టీచర్స్ యూనియన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సుదర్శన్ రూ.15వేల విలువైన గుర్తింపుకార్డులు, వాటర్ బాటిళ్లు, పరీక్ష ప్యాడ్లను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేశ్‌రావు, వసంత, అనురాధ, గంగాప్రసాద్, సుకన్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టికల్ 19ని ఎత్తివేయాలి

నిజామాబాద్ నాగారం: కులవృత్తే జీవనాధారంగా జీవిస్తున్న నాయీబ్రాహ్మణులకు ఆర్టికల్ 19తో అన్యాయం జరుగుతోందని దానిని వెంటనే ఎత్తివేయాలని నగర నాయీబ్రాహ్మణ దుకాణదారుల యూనియన్ అధ్యక్షులు దేశాయి గంగాధర్ డిమాండ్ చేశారు. శుక్రవారం గాజులపేటలోని కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఆర్టికల్ 19లో ఉన్న 18వ సవరణను సవరించి కులవృత్తులను ఆదుకోవాలన్నారు. నాయీబ్రాహ్మణేతరులు సెలూన్ షాపు పెట్టుకోవచ్చన్న నిబంధన ఉన్న ఆర్టికల్ 19ని రద్దు చేయాలన్నారు. హైకోర్టు తీర్పు ఇవ్వడం విచారకరమన్నారు. సమావేశంలో నాయకులు అంజయ్య, రామకృష్ణ, బాలస్వామి, సురేందర్, హన్మాండ్లు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా



సిరికొండ: రైతులకు యూరియాను అందుబాటులో ఉంచుతున్నామని మండల వ్యవసాయశాఖ అధికారి నర్సయ్య తెలిపారు. మండల కేంద్రంలోని సొసైటీలో యూరియాను రైతులకు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 2277 మెట్రిక్ టన్నుల యూరియాను మండలంలో పంపిణీ చేసినట్లు తెలిపారు. మండలానికి ప్రతి రోజు 60 నుంచి 80 టన్నుల వరకు యూరియాను సరఫరా చేస్తున్నామని అన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సుభాష్‌నగర్: నగరంలోని వినాయక్‌నగర్ సబ్ స్టేషన్‌లో నాల్గో శనివారం నిర్వహణలో భాగంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని టౌన్–1 ఏడీఈ ఆర్ చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోటగల్లి, గాయత్రినగర్, ఫులాంగ్, నిఖిల్ సాయి హోటల్, యెండల టవర్స్, తుల్జా భవానీ ఆలయం తదితర ఏరియాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

మొరం టిప్పర్ పట్టివేత

మోపాల్: మండలకేంద్రంలో అనుమతులు లేకుండా తరలిస్తున్న మొరం టిప్పర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై జాడే సుస్మిత శుక్రవారం తెలిపారు. అక్రమంగా మొరం తరలిస్తే కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి పట్టివేత

నిజామాబాద్ రూరల్: రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేశ్‌పూర్‌గ్రామంలో ఈనెల 23న రాత్రి జరిగిన చోరీ కేసులో నిందితుడిని పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహ్మద్ ఆరీఫ్ శుక్రవారం తెలిపారు. కేశాపూర్ గ్రామశివారులో ఉన్న మహాలక్ష్మీ ఆలయంలో అమ్మవారి పుస్తెలతాడు, వినాయకుని పంచలోహ విగ్రహం, హుండీ డబ్బులు అపహరణకు గురైన విషయం తెలిసిందే. ఈ ఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడిని పట్టుకొని, చోరీకి గురైన వస్తువులను రికవరీ చేశారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు వివరించారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్స్





మారుతినగర్‌లో ప్రమాదకరంగా ఉన్న అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ మ్యాన్‌హోల్స్



- మారుతినగర్‌లో రోడ్డు కంటే ఎత్తులో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ మ్యాన్‌హోల్స్
- ఆదమరిస్తే అంతే సంగతులు
- ఇబ్బందిపడుతున్న కాలనీవాసులు, వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

నిజామాబాద్ నాగారం: నగరంలోని మారుతినగర్‌లో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ మ్యాన్‌హోల్స్ ప్రమాదకరంగా ఉన్నాయి. రోడ్డు కంటే ఎత్తులో ఉండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వాహనదారులు ఆదమరిస్తే అంతే సంగతులు. పలువురు వాహనదారులు అదుపుతప్పి కిందపడి గాయాలైన ఘటనలు ఉన్నాయి. నెల రోజుల క్రితం ఈ ప్రాంతంలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ మ్యాన్‌హోల్స్ మరమ్మతుల కోసం తవ్వారు. మరమ్మతులను తూతూమంత్రంగా చేపట్టి అలాగే వదిలేశారు. మారుతినగర్‌లో స్కూల్ బస్సులు, పలు వాహనాలు అధిక సంఖ్యలో ప్రయాణిస్తుంటాయి. ఈ ప్రాంతం చాలా రద్దీగా ఉంటుంది. రాత్రిళ్లు ఈ ప్రాంతం గుండా కొత్త వారు వస్తే మ్యాన్‌హోల్స్ గమనించక వాటి గుండా ప్రయాణిస్తుండడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. వీటి చుట్టూ రోడ్డు సరిగా లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నేటి చిత్రం



వర్నిచౌరస్తా వద్ద చెత్తకుప్పలో పేపర్లు తింటున్న పశువులు

చెత్తకుప్పలు.. పశువుల మేత స్థావరాలు

నిజామాబాద్ సిటీ: నగరంలోని పలు కూడళ్ల వద్ద ఉన్న చెత్త కుప్పలు మూగజీవాలకు ఆహార స్థావరాలుగా మారాయి. బల్దియా అధికారులు చెత్త తొలగించడంలో శ్రద్ధ వహించడం లేదు. దీంతో చెత్తకుప్పల వద్ద నిల్వ ఉన్న పాలిథిన్ పేపర్లు, చిత్తు పేపర్లను పశువులు తింటున్నాయి. పశువులు రోడ్లమీద తిరుగుతున్నా వాటి యజమానులు, బల్దియా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి. – గట్ల సింజిత్ కుమార్, ఆనంద్‌నగర్ కాలనీ

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

నిజామాబాద్ అర్బన్ - 95531 30597 నిజామాబాద్ రూరల్ - 97053 46541

కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి



మిట్టాపల్లిలో గోదాంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి, డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి

- నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

డిచ్‌పల్లి: రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు. శుక్రవారం డిచ్‌పల్లి మండలం రాంపూర్ సొసైటీ ఆధ్వర్యంలో మిట్టాపల్లిలో రూ.15 లక్షల వ్యయంతో నిర్మించిన 250 మెట్రిక్ టన్నుల గోదాంను డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ తారాచంద్ నాయక్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 9 రోజుల్లో రూ.9వేల కోట్ల రైతు రుణమాఫీ చేసిందన్నారు. సన్న వడ్లకు రూ.500 బోనస్, సాగుకు ఉచిత కరెంట్ అందజేస్తున్నట్లు తెలిపారు. అలాగే సొసైటీల ద్వారా రైతులకు అవసరమయ్యే విత్తనాలు, ఎరువులను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేశ్‌రెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, డీసీసీబీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు అమృతాపూర్ గంగాధర్, నవీన్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొలసాని శ్రీనివాస్, మాజీ ఎంపీపీలు కంచెటి గంగాధర్, నర్సయ్య, డిచ్‌పల్లి సొసైటీ చైర్మన్ రాంచందర్ గౌడ్, నాయకులు గణేశ్, బాల గంగాధర్, సొసైటీ సీఈవో నాగరాజు, సిబ్బంది నాగేశ్వరరావు, డైరెక్టర్లు, వీడీసీ సభ్యులు, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న సీజనల్ వ్యాధులు

- అప్రమత్తతే నివారణ మార్గం
- ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



రామడుగులో పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

ధర్పల్లి: వర్షాకాలంలో వచ్చే జలుబు, సాధారణ జ్వరాలు, మలేరియా, డెంగీ వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ రోజువారి దినచర్యల్లో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. పరిసరాల, వ్యక్తిగత శుభ్రత పాటించడంతో పాటు స్వీయ జాగ్రత్తలు తీసుకుంటే కాలానుగుణ వ్యాధుల బారి నుంచి తప్పించుకోవచ్చని వైద్యులు, అధికారులు సూచిస్తున్నారు. ప్రతి శుక్రవారం గ్రామాల్లో డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

దోమల వ్యాప్తితో..

గ్రామాల్లో డ్రెయినేజీ సౌకర్యాలు లేకపోవడంతో రోడ్లపైనే మురికినీరు నిలుస్తుంది. దీని వల్ల దోమలు వ్యాప్తి చెంది ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. తలనొప్పి, గొంతునొప్పి, మలేరియా, టైఫాయిడ్, చికున్ గున్యా, విషజ్వరాలు, డెంగీ, ఫైలేరియా వంటివి ప్రబలే అవకాశాలున్నాయి.

విష జ్వరాలు..

ఒళ్లు నొప్పులు, జలుబు, తుమ్ములతో జ్వరం వస్తుంది. వారం రోజుల పాటు జ్వరం తీవ్రంగా ఇబ్బంది పెడుతుంది. తలనొప్పి, చలి, నీరసం విషజ్వరాల ప్రధాన లక్షణం.

దోమలను అరికట్టే విధానం..

ఇళ్లలోని మంచినీటి తొట్లలో నీరు నిల్వ ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఈగలు, దోమలు ముసరకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. నీరు నిల్వ ఉండే ప్రదేశాల్లో వేస్ట్ ఆయిల్ స్ప్రే చేయాలి. దోమ తెరలను తప్పని సరిగా ఉపయోగించాలి. గ్రామాల్లో మురికి నీరు నిల్వ ఉండకుండా, లార్వా పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. తాగేనీటిని కాచి చల్లార్చిన తర్వాతే తాగాలి.

చెత్త తొలగిస్తున్నాం



జీపీల్లో ప్రతిరోజు శానిటేషన్ పనులు చేస్తున్నాం. పంచాయతీ ట్రాక్టర్ ద్వారా గ్రామాల్లో ఉన్న చెత్తను ప్రతిరోజు డంపింగ్ యార్డ్‌కు తరలించేలా చర్యలు తీసుకుంటున్నాం.
– లక్ష్మారెడ్డి, ఎంపీడీవో, ధర్పల్లి

ఓబీసీ సెమినార్‌లో పాల్గొన్న విపుల్ గౌడ్



నిజామాబాద్ సిటీ: ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ శుక్రవారం నిర్వహించిన ఓబీసీ సమావేశంలో జిల్లా యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు విపుల్ గౌడ్ పాల్గొన్నారు. సమావేశంలో ఏఐసీసీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. అణగారినవర్గాల సామాజిక, విద్యా, ఆర్థిక అభ్యున్నతి అవశ్యకతపై చర్చించారు. కార్యక్రమంలో పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్, మైన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్, పలువురు నాయకులను విపుల్‌గౌడ్ కలిశారు.

ఉప తహసీల్దార్ బదిలీ

సిరికొండ: మండల ఉప తహసీల్దార్ ప్రవీణ్, కంప్యూటర్ ఆపరేటర్ అజ్మత్ బదిలీ అయ్యా రు. ఉప తహసీల్దార్ పౌరసరఫరాల శాఖ కా ర్యాలయానికి, కంప్యూటర్ ఆపరేటర్ మెండో రా మండలానికి బదిలీ అయ్యారు. వారి స్థానా ల్లో మండలానికి ఎవరినీ కేటాయించలేదు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

- నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి



వైద్యశిబిరాన్ని సందర్శించి వివరాలు తెలుసుకుంటున్న ముప్ప గంగారెడ్డి

మోపాల్: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ అధికారులు, వైద్యసిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తూ తగిన చర్యలు చేపట్టాలని నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కాల్పోల్‌లో స్థానిక పాఠశాలలో కొనసాగుతున్న వైద్యశిబిరాన్ని కాంగ్రెస్ ఆదివాసీ, గిరిజన జిల్లా చైర్మన్ కెతావత్ యాదగిరితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డెంగీ, ఇతర వ్యాధులు ప్రబలడానికి గల కారణాలపై ఆరా తీశారు. జ్వర పీడితులను పరామర్శించి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. జ్వరాలతో బాధపడుతున్న వారి ఆరోగ్య పరిస్థితిని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రత్యూషను అడిగి తెలుసుకున్నారు. వ్యాధి తీవ్రత తగ్గుముఖం పట్టేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఎంపీడీవో రాములు నాయక్, మెడికల్ ఆఫీసర్ ప్రత్యూషను ఆదేశించారు. వారి వెంట జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మోహన్ నాయక్, మోపాల్ మండల అధ్యక్షుడు ఎల్లోల్ల సాయిరెడ్డి, గ్రామ అధ్యక్షుడు సురేశ్, గ్రామస్తులు ఉన్నారు.

ప్రభుత్వ విద్య.. వైద్యం అంతా మిథ్యేనా..?



తిర్మన్‌పల్లి ప్రాథమిక పాఠశాల గదుల్లోకి చేరిన వర్షపు నీరు



ఆరోగ్య కేంద్రం ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలు

ఇందల్వాయి: ప్రజలకు అందించే వైద్యం, విద్యపై ప్రభుత్వాలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉందో పై ఫొటోలు చూస్తే అర్థమవుతోంది. ఇందల్వాయి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మొత్తం పిచ్చి మొక్కలతో నిండిపోయి, విష పురుగులు, దోమలకు ఆవాసంగా మారే అవకాశం ఉన్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. గత కొన్నేళ్లుగా వర్షాకాలంలో ఇక్కడ ఇదే పరిస్థితి నెలకొంటోంది.
తిర్మన్‌పల్లి గ్రామంలో రోడ్డు పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాలలోని తరగతి గదుల్లో నీరు చేరుతున్నా పట్టించుకున్న నాథుడే లేడు. ఏళ్ల తరబడి నీళ్లు చేరుతున్న ప్రతీసారి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షపు నీటితో పాటు పాఠశాలలోకి దుర్గంధం చేరి విద్యార్థుల ఆరోగ్యం, మధ్యాహ్న భోజనం కలుషితమయ్యే అవకాశం ఉన్నా సమస్యను ఎవరూ పరిష్కరించడంలేదు. సమస్యలపై ఉన్నత స్థాయి అధికారులకు, ప్రజా ప్రతినిధులకు స్థానిక ప్రజలు పలుమార్లు వినతిప్రతాలు అందించినా పరిష్కారం కావడం లేదు. ప్రభుత్వం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి



సమ్మేళన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మోహన్‌నాయక్, నాయకులు

నిజామాబాద్ నాగారం: జిల్లా కేంద్రంలోని బృందావనం గార్డెన్‌లో ఈ నెల 27న నిర్వహించే బంజారా సేవా సంఘం ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆలిండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీహరినాయక్, జిల్లా అధ్యక్షుడు మోహన్‌నాయక్ కోరారు. శుక్రవారం నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బంజారాల ఐక్యత చాటడానికి ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమ్మేళనానికి ముఖ్య అతిథిగా ఆలిండియా బంజారా సేవా సంఘం జాతీయ అధ్యక్షుడు ఉమేశ్, రాష్ట్ర అధ్యక్షుడు రాములు నాయక్ హాజరవుతారని అన్నారు. అనంతరం ఆత్మీయ సమ్మేళన పోస్టర్లను ఆవిష్కరించారు. సమ్మేళనాన్ని సంఘ సభ్యులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి రవి నాయక్, ఉపాధ్యక్షులు రామారావు, చిన్న నాయక్, నాయకులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ ఇన్‌చార్జి ఎస్‌హెచ్‌వోగా స్వప్న



ఖలీల్‌వాడి: నిజామాబాద్ ఎక్సైజ్ ఇన్‌చార్జి ఎస్‌హెచ్‌వో బాధ్యతలను ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐగా పని చేస్తున్న స్వప్నకు అప్పగించారు. ఈ మేరకు ఆమె శుక్రవారం ఈఎస్ మల్లారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇది వరకు ఎస్‌హెచ్‌వోగా పని చేసిన దిలీప్‌ను సాలూరా చెక్ పోస్టుకు బదిలీ చేయగా, కొన్ని రోజులపాటు ఎస్సై సుస్మితకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారు. ప్రస్తుతం ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో పని చేస్తున్న స్వప్నకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

సిద్దిపేట మహాసభకు కార్మికులు తరలిరావాలి



సమావేశంలో మాట్లాడుతున్న కల్లెడి గంగాధర్

నిజామాబాద్ నాగారం: సిద్దిపేటలో ఈ నెల 28న నిర్వహించే మహాసభకు కార్మికులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లెడి గంగాధర్ కోరారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ప్రమాద బీమా రూ. పది లక్షల సౌకర్యం కల్పించాలని, 55 ఏళ్లు నిండి కార్మికుడికి రూ. ఐదు వేల పింఛన్‌ను కార్మిక వెల్ఫేర్ బోర్డు నుంచి అందించాలని కోరారు. సభను కార్మికులు విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పెంచాల వేణు, కార్యదర్శి శాంతయ్య, సహాయ కార్యదర్శి ఎస్‌కే హనీఫ్, పట్టణ అధ్యక్షుడు పిండే బాబురావు, ఉపాధ్యక్షులు ముదారపు రాములు, కూనగంగాధర్, రమేశ్, రాజు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రావణ మాసం ఎంతో విశిష్టమైంది



జెండా బాలాజీ ఆలయంలో పూజలు చేస్తున్న విజయరామారావు



వారాహి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నిజామాబాద్ రూరల్: శ్రావణ మాసం ఎంతో విశిష్టమైందని దేవాదాయ–ధర్మాదాయ శాఖ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సహాయ కమిషనర్ విజయరామారావు అన్నారు. శ్రావణమాసం మొదటి శుక్రవారం పురస్కరించుకొని నగరంలోని జెండాబాలాజీ, గోల్‌హనుమాన్ ఆలయాలను పరిశీలించారు. అనంతరం ఆలయాల్లో పూజలు చేశారు. శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని జెండా బాలాజీ, గోల్ హనుమాన్, సారంగపూర్ హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టున్నట్లు పేర్కొన్నారు.

వారాహి దేవాలయంలో..

నగర శివారులో ఉన్న శ్రీ వారాహి దేవాలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయ చైర్మన్ మంచాల జ్ఞానేందర్, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి రోజు ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ పేర్కొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



విద్యార్థి సంఘాల నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

నిజామాబాద్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం వారు పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఇల్లు ముట్టడికి యత్నించారు. సమాచారం అందుకున్న పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈక్రమంలో పోలీసులకు విద్యార్థి సంఘం నాయకులకు మధ్య తోపులాట జరిగింది. అనంతరం పోలీసులు పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం నాయకులను అరెస్టు చేసి నాలుగో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరించిందన్నారు. ఇప్పటికైనా స్పందించి సమస్యలను పరిష్కరించాలన్నారు. నాయకులు కార్తీక్, గౌతంకుమార్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899